క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


కొందుర్గులో పూజలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా కొందుర్గు గాడిబావి ఆంజనేయస్వామికి గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపూజ, గోపూజ, స్వస్తపుణ్యాహవాచనం, అంకురారప్పణం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తనయుడు మురళీయాదవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్ ప్రారంభిస్తున్న శ్రీశైలం

నందిగామ: మండలంలోని చేగూరులో 'చేగూరు ప్రీమియం లీగ్ మ్యాచ్'ను ఆదివారం కాంగ్రెస్ నాయకుడు మంకాల శ్రీశైలం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. వార్డు సభ్యుడు ఆవుల శివ, మంగలి శ్రీను, వంశీ, మంచనపల్లి శివలు ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు స్పాన్సర్లుగా ఉన్నారని, వారం రోజుల పాటు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వెంకట్‌చారి, వంశీ, కార్తీక్, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు


సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పూలబొకే, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీఎస్పీ సభను జయప్రదం చేయండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తూరు: ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న బీఎస్పీ రాష్ట్ర సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఇంద్రసేనా కోరారు. సోమవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మండలకేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభకు జాతీయ అధ్యక్షురాలు మాయవతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో రాణించే వరకు బీఎస్పీ వారికి అండగా ఉంటుందన్నారు. మండలం నుంచి పెద్ద సంఖ్యలో సభకు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, కృష్ణ, గణేశ్ , అనిత పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం ఆపండి


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండలంలోని పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో అక్రమ నిర్మాణాన్ని ఆపాలని బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లాటి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాల ఆవరణ స్థలంలో సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి తనకు సంబంధించిన వ్యక్తులకు భవనం కట్టుకోవడానికి స్థలం ఇచ్చాడని ఆరోపించారు. ఆదివారం తెల్లవారు జామున శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ, మండల విద్యాధికారికి, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అధికారులు స్పందించకుంటే గ్రామస్తులతో కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సింలు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ శివానంద్, నర్సింలు, రాంచందర్ నాయక్, లక్ష్మయ్య, ఫకీరయ్యగౌడ్, యాదయ్య, శ్రీను, శేఖర్, రామస్వామి, రవి, ఆంజనేయులు, కృష్ణయ్య, జహంగీర్, భిక్షపతి, యాదయ్య పాల్గొన్నారు.


మొయినాబాద్: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసిన సీఐటీయూ నాయకులు


కొత్తూరు: భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేస్తున్న నాయకులు

ఎరుపెక్కిన పల్లెలు

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని కార్మికులు సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండావిష్కరణ, బైక్ ర్యాలీలు నిర్వహించి, కార్మిక అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను కాలరాసి, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల పని దినాలను తగ్గించి సకాలంలో వేతనాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్ వర్క్


షాద్‌నగర్‌రూరల్: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ


కొత్తూరు: జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు



చేవెళ్ల : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



షాద్‌నగర్‌రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు


షాబాద్: జెండా ఎగురవేస్తున్న సీపీఐ నేత జంగయ్య, తదితరులు



కేశంపేట: జెండా ఆవిష్కరణ చేస్తున్న నర్సింహారెడ్డి


కొందుర్గు: మేడే వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు


నందిగామ: నాట్కో పరిశ్రమ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

భక్తిశ్రద్ధలతో బీరప్ప ఉత్సవాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్‌లో సోమవారం బీరప్ప స్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, బీజేపీ నేత పాలమూరి విష్ణువర్దన్ రెడ్డి, ఎమ్మెల్యే తనయుడు మురళీయాదవ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మల్కాపూర్‌లో..

చేవెళ్ల: మండలంలోని మల్కాపూర్‌లో రెండు రోజులుగా మల్లన్న, బీరప్ప బోనాల ఉత్సవాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా జరిపారు. సోమవారం నూతన ఆలయంలో బీరప్ప బోనాల ఉత్సవాల్లో ప్రారంభించారు. మహిళలు బోనాలతో దేవాలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య వైభవంగా సాగాయి. ఆలయం వద్ద గ్రామస్తులంతా వంటవార్పులు చేసుకున్నారు. సర్పంచ్ శివారెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు, యువకులు వేడుకల్లో పాల్గొన్నారు.


బోనాల ఊరేగింపులో పాల్గొన్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

కొనుగోలు కేంద్రాలతో ప్రయోజనం

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని కొత్తపేటలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ గంధ్ర జగదీశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ఇటీవల వర్షాలకు దెబ్బతిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. వడ్లను, మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నవీన్‌కుమార్, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, పల్లె నర్సింగ్‌రావు, మల్లేష్‌యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరిరావు, మురళీధర్‌రెడ్డి, శ్రీను, వెంకటయ్య, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

మా సమస్యలు పరిష్కరించండి


సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని బీఎస్పీ జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్ డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు సోమవారం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి రాంప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ...ప్రభుత్వం చేపట్టిన హరితహారం, పల్లెప్రగతివంటి కార్యక్రమాలు విజయవంతం కావడంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఉందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. గ్రామపంచాయతీలకు స్వచ్ఛత అవార్డులు రావడంలో వారి కృషి ఉందని తెలిపారు. రెగ్యులరైజ్ చేయని యెడల బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింలు, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, ఎఆశీర్వాదం, చంద్రయ్య, మల్లేష్, రాజేష్‌చౌహాన్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలి

చేవెళ్ల: తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేపీఎస్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, శేఖర్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆమనగల్లు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సింగిల్‌విండో కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

'కంటి వెలుగు'తో దృష్టి సమస్యలు దూరం


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నవనీత

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో కంటి వెలుగు పరీక్షలు పేదలకు ఆదర్శమని ఎత్‌మార్‌పల్లి సర్పంచ్ నవనీత అన్నారు. సోమవారం మండలంలోని ఎత్‌మార్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు కంటి వెలుగులో పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. దృష్టి సమస్యలు ఉన్నవారికి అద్దాలు, ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సుష్మా, అద్దాల అధికారి చైతన్య, డీఈఓ అబ్దుల్లా, ఏఎన్ఎంలు జ్ఞానేశ్వరి, గంగా, ఆశవర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటివెలుగు' లబ్ధి

షాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీతారాంపూర్ సర్పంచ్ కొత్త పాండురంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపూర్‌లో వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కంటి వెలుగు రూపుదిద్దుకుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందీప్, అంగన్‌వాడీ టీచర్ మీనాకుమారి, వైద్య సిబ్బంది గోపాల్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, గ్రామస్తులు తదితరులున్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించండి

15వ రోజుకు చేరిన వీఓఏల సమ్మె

తలకొండపల్లి: సమస్యల సాధనకై వీఓఏలు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె సోమవారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు సమ్మె శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మట్లాడుతూ.... అర్హులైన వీఓఏలను సీసీలుగా గుర్తించాలని, ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలన్నారు. రూ.10 లక్షల ఆరోగ్యబీమా సౌకర్యం , సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని.. వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీశైలం, లలితాజ్యోతయ్య, కిష్టమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మండల అధ్యక్షుడు బాలకృష్ణయ్య, కురుమయ్య, నర్సింహ, కల్పన, అరుణ, కృష్ణారెడ్డి, జ్యోత్స్న, శ్రీవాణి, అనిత, మానస, యాదమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి


బీరప్ప జాతరలో పాల్గొన్న భక్తులు

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: ప్రజలు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోడంపహాడ్‌లో బీరప్ప జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అవినాశ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన దేవాలయ అభివృద్ధికి రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు సరళ, మధుకర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, యాదిరెడ్డి, రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తహసీల్దార్ అశోక్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ ఆదేశాలతో అజీజ్‌నగర్‌లోని సర్వే నంబర్ 49లో 46 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గత కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించడంతో పైఅధికారుల సూచనల మేరకు కూల్చివేయడం జరిగిందని మొయినాబాద్ తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ భూములను అక్రమించుకోని నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ఈ కూల్చివేతల్లో సీఐ లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, షాబాద్ సీఐ గురవారెడ్డి, చేవెళ్ల సీఐ ప్రభాకర్‌రెడ్డి, నార్సింగి సీఐ, ఎస్ఓటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయాలి...

పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం న్యాయం చేయాలని అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ వాసులు మాణిక్యం, సుధాకర్ తదితరులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. సోమవారం ఉదయం అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో పేదలు నిర్మించుకున్న ఇళ్లను నెలమట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటారని వారు కోరారు.


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



షాద్‌నగర్‌రూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాలలో కమ్మదనం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విడుదల చేసిన రెండవ సెషన్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించి మంచి ర్యాంకులను అందుకున్నారు. ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థినులను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అభినందించారు. కళాశాల నుంచి 34మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 15మంది విద్యార్థినులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని ఆమె తెలిపారు. విద్యార్థిని డి. పల్లవి 98.48 శాతంతో 424 ర్యాంకు సాధించి టాప్ ర్యాంకర్‌గా నిలిచింది. బి.పల్లవి 95.96శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ నాగకళ్యాణి హర్షం వ్యక్తం చేశారు. అలాగే, గురుకులాల కార్యదర్శి రొనాల్డ్‌రోస్, జాయింట్ సెక్రటరీ శారద, ఓఎస్‌డీ చంద్రకాంత్‌రెడ్డి, కిషోర్ సంతోషం వ్యక్తం చేశారు.